

'సంజీవని'తో..

సంజీవని ఆస్పత్రి పసి హృదయాలను పదిలం చేస్తున్న దేవాలయం అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. వివరాలు 8లో ▸



సేవే లక్ష్యం..

సేవే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు.. వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రంలో ఈ నెల 22 నుంచి జరగనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానిస్తూ బుధవారం పలువురి ప్రముఖులకు ఆలయ ప్రతినిధులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. జాగృతి అధ్యక్షురాలు కవిత, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తదితరులను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానపత్రికలు ఇచ్చారు.

దరఖాస్తు చేసుకోండి

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు సబ్జెక్ట్‌లో బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుం బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులతో, బీసీ, ఓసీలు 55శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలన్నారు. అదే విధంగా యూజీసీ, నెట్, సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో ఈనెల 18న ఉదయం కళాశాలలో జరిగే ఇంటర్వ్యూ(డెమో)కు హాజరు కావాలని సూచించారు.

శిక్షణ పొందుతున్న సర్వేయర్లు

హుస్నాబాద్‌రూరల్: పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో కొత్త సర్వేయర్లు భూముల కొలతలపై డిజిటల్ సర్వేలో శిక్షణ పొందుతున్నారు. వీరికి సర్వేయర్ లక్ష్మీనారాయణ మ్యాప్‌లు గీయడం, పాత రికార్డుల ప్రకారం కొలతలు వేయడంపై శిక్షణ ఇస్తున్నారు. సర్వేయర్లకు డిజిటల్ పరిజ్ఞానం కోసం కంప్యూటర్‌లో అవగాహన కల్పిస్తున్నారు.

తెలంగాణ చరిత్ర ఘనం

అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్



జాతీయ జెండాకు వందనం చేస్తున్న అదనపు డీసీపీ కుశాల్కర్ తదితరులు

సిద్దిపేటకమాన్: తెలంగాణకు అత్యంత వైభవమైన చరిత్ర ఉందని సిద్దిపేట అదనపు డీసీపీ అడ్మిన్ సీహెచ్ కుశాల్కర్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల రక్షణ ధ్యేయంగా విధులు నిర్వహించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్



రక్త దాతలకు పండ్లు పంపిణీ చేస్తున్న బైరి శంకర్

హుస్నాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. మోదీ జన్మదినం పురస్కరించుకొని పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, మండల అధ్యక్షుడు సంపత్ నాయక్ ఆధ్వర్యంలో వేర్వేరుగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ విశ్వాస్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించగా 103 మంది రక్త దానం చేశారు. విమోచన దినోత్సవం పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు, రామ మందిరం నిర్మాణం, జటిలమైన సమస్యలను మోదీ పరిష్కరించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాం గోపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి శరవేగం

సంక్షేమానికి ప్రాధాన్యం

- బైరాన్‌పల్లి పోరాట పటిమ.. తెలంగాణ పోరాటానికి మార్గదర్శకం
- ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు కల్పించాం
- జిల్లాను ప్రగతి పథంలో నిలుపుదాం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం



కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సాక్షి, సిద్దిపేట: ప్రజాపాలన ప్రభుత్వం.. అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.5లక్షల నుంచి రూ. పది లక్షలు పెంచామన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. సెప్టెంబర్ 17న భారత దేశంలో తెలంగాణ హైదరాబాద్ విలీనమైన రోజు, ఈ విలీన దినోత్సవాన్ని ప్రజాపాలన దినోత్సవంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుపుకొంటున్నామని తెలిపారు. బైరాన్‌పల్లి పోరాట పటిమ తెలంగాణ పోరాట స్ఫూర్తికి మార్గదర్శకమని కొనియాడారు.

అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా..

అన్ని రంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని మంత్రి తెలిపారు. రేషన్ కార్డు కోసం పదేళ్లుగా జనం నిరీక్షించారని, వారందరూ సన్న బియ్యం తినాలన్న ఉద్దేశ్యంతో కొత్త కార్డులు జారీచేశామన్నారు. రెవెన్యూ ప్రక్షాళన చేస్తూ భూ భారతిని తీసుకువచ్చామని గుర్తు చేశారు. నిధుల కొరత ఉన్నప్పటికీ విద్యకు ప్రాధాన్యతను ఇస్తూ సమృద్ధిగా నిధులు కేటాయిస్తూ సీఎం రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు.

వడ్డీలేని రుణాలు ఇస్తున్నాం..

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళల అభివృద్ధి కోసం ఇందిరా క్యాంటీన్లు, పెట్రోల్ పంపులు, సోలార్ ప్లాంట్ల నిర్వహణ, వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని మంత్రి వివరించారు. 65వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. హైదరాబాద్‌లో అమరవీరుల స్ఫూర్తిగా స్తూపం నిర్మిస్తున్నామని, ఇది భవిష్యత్ తరాలకు గుర్తుండే విధంగా రూపకల్పన చేస్తున్నామన్నారు. మొక్కలను నాటి ఆదర్శంగా నిలిచిన ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, సీపీ డాక్టర్ అనురాధ, అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, జిల్లా అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



అమరులకు నివాళిగా మౌనం పాటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతి, సీపీ అనురాధ, అదనపు కలెక్టర్లు



హాజరైన అధికారులు, కాంగ్రెస్ నాయకులు

లబ్ధిదారులే ఆ ఇళ్లల్లో ఉండాలి

- కలెక్టర్ హైమావతి
- డబుల్‌బెడ్రూం ఇళ్లపై అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేటరూరల్: జిల్లాలోని డబుల్‌బెడ్రూం ఇళ్లలో ఎంపిక చేసిన లబ్ధిదారులే నివాసం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో డబుల్‌బెడ్రూం ఇళ్ల మంజూరు, లబ్ధిదారులకు అప్పగింత, ఇతర ప్రగతి పనులపై తహసీల్దార్, మున్సిపల్, హౌసింగ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరైనా లబ్ధిదారులకు అందించకపోవడం, కొన్ని అన్యాక్రాంతం కావడం వంటి ఘటనలు దృష్టికి వచ్చాయన్నారు. జిల్లాలో డబుల్‌బెడ్రూం ఇళ్లను వేరేవాళ్లు ఆక్రమించిన క్రమంలో వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఖాళీ చేయించి అర్హులకు అప్పగించాలన్నారు. మిగిలిన ఇళ్లను ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హతగల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి మిగిలిన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగిరం చేయాలి

అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు వెంటనే మానిటరింగ్ కమిటీలను నియమించాలని, నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు ప్రతి గ్రామంలో పర్యటించి నిర్మాణాలను పూర్తి చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ ఆర్డీఓలు సదానందం, రామ్మూర్తి, చంద్రకళ, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పతాకం ఆవిష్కరణ

సిద్దిపేటజోన్: ప్రజాపాలన వేడుకల్లో భాగంగా బుధవారం జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ హైమావతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ గీతాలాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

హుస్నాబాద్: ప్రస్తుతం 90 శాతం రోగాలు ఆహారం ద్వారానే వస్తున్నాయని, మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హైమావతి అన్నారు. బుధవారం పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళలకు, కౌమార దశ బాలికలకు వైద్య శిబిరాలు నిర్వహించడం ఈ కార్యక్రమ ఉద్దేశ్యం. కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబంలో మహిళా ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మునగాకు, పప్పులు, ఆకుకూరలు సమపాళ్లల్లో తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆస్పత్రిలో ఆయా వైద్య శిబిరాలను ప్రారంభించారు.



స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హైమావతి

ఆదిపితామహుడు విశ్వకర్మ



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్, సీపీ తదితరులు

సిద్దిపేటరూరల్: కర్మయోగం, శిల్పకళ, యాంత్రిక విజ్ఞానానికి ఆదిపితామహుడు విశ్వకర్మ అని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. బుధవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి మంత్రి పొన్నం, కలెక్టర్ హైమావతి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశ్వకర్మ మహర్షి నిర్మించిన అద్భుతాలను మనం శ్రుతి, స్మృతి, పురాణాల్లో తెలుసుకుంటామన్నారు. మన జీవనోపాధికి, సమాజ అభివృద్ధికి మూలాధారం అయిన పనిముట్లను కూలీలు, శిల్పులు, ఇంజనీర్లు, కార్మికులు, కర్మకారులు అందరూ పూజిస్తారన్నారు. ప్రతి పని చిన్నది పెద్దది అని చూడకుండా, కష్టపడి, నిజాయితీతో పనిచేస్తేనే జీవితం సార్థకమవుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, సీపీ అనురాధ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో 'పూలే' విద్యార్థుల ప్రదర్శన



జ్ఞాపికను అందుకుంటున్న వర్గల్ పూలే విద్యార్థుల బృందం

వర్గల్(గజ్వేల్): సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం వర్గల్ పూలే గురుకుల డిగ్రీ కళాశాల బాలికలకు దక్కింది. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాధారాణి మార్గదర్శకంలో 22 మంది వలంటీర్ల బృందం రాష్ట్రపతి నిలయం చేరుకున్నారు. 'తెలంగాణ ఉదయం' పేరిట తెలంగాణ విమోచన పోరాట చరిత్ర ఘట్టాలను చాటుతూ 15 నిమిషాల నాటక ప్రదర్శనతో ఆహుతులను అలరింపజేశారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, మాడపాటి హన్మంతరావు, ఆరుట్ల కమలాదేవి తదితర పాత్రలతో విద్యార్థులు ఆకట్టుకుని ప్రశంసలు చూరగొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ప్రసిద్ధ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ, రజాకార్ సినిమా నిర్మాత నరసింహ రెడ్డి, దర్శకుడు, ఛాయాగ్రాహకుడు రమేశ్ విద్యార్థుల ప్రదర్శన తిలకించి అభినందించారు. జ్ఞాపికను అందించి సన్మానం చేశారు.

యూరియా కొరత లేదు

జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతులకు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జగదేవ్‌పూర్ మండలంలో 50 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, విడతల వారీగా పంపిణీ చేస్తామన్నారు. ప్రతి రైతుకూ యూరియా అందుతుందన్నారు.



జగదేవ్‌పూర్‌లో ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న స్వరూపరాణి

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేశ్



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న రమేశ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలలో ధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిబద్ధత కల్గి ఉండాలని ఎస్‌సీఈఆర్‌టీ (రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి) డైరెక్టర్ గాజర్ల రమేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో నిర్వహించిన విద్యాశాఖ అధికారుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో గాజర్ల రమేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో సుమారు 15 అంశాలపై సమీక్ష నిర్వహించి, జిల్లా విద్యాధికారి, కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు, గాజర్ల రమేశ్ సూచనలు ఇచ్చారు. కొండపాక మండల పరిధిలోని సిరిసినగండ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల కనీస సామర్థ్యాలు, ప్రతిభను పెంచుతున్న తీరును ప్రశంసించి సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

గజ్వేల్‌రూరల్: జిల్లా స్థాయి అండర్–19 బాలబాలికలు, సీనియర్ పురుషులు, మహిళల నెట్‌బాల్ జట్ల ఎంపిక శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు విజయరేఖ, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్‌లు తెలిపారు. 2007 మార్చి 31 తర్వాత జన్మించిన క్రీడాకారులు తమ వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఉదయం 10గంటలకల్లా ప్రజ్ఞాపూర్‌లోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే ఎంపికకు హాజరు కావాలన్నారు.

బియ్యం నాసిరకం.. బువ్వ అదోరకం



మెత్తటి ముద్దలాంటి అన్నం

- పాఠశాలలకు పురుగుల బియ్యం సరఫరా
- మెత్తటి అన్నంతో విద్యార్థుల అవస్థలు
- అధికారుల పర్యవేక్షణ లోపం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



దుబ్బాకలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

దుబ్బాకటౌన్: ప్రతీ పాఠశాలకు నాణ్యమైన సన్న బియ్యంతో విద్యార్థుల కడుపునింపుతున్నామని ప్రభుత్వం చెబుతోంది. కానీ దుబ్బాకలోని పలు పాఠశాలల్లో మాత్రం ఆ పరిస్థితి కానరావడం లేదు. బియ్యం సంచి తెరిస్తే చాలు ముక్క వాసన, తెల్లపురుగులు, లక్క పురుగులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ లక్ష్యం ఘనమైనప్పటికీ జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యమైన బియ్యం అందక కింది స్థాయి ఉద్యోగులు, భోజనం మింగుడు పడక విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

పురుగుల బియ్యం సరఫరా చేయడంతో వాటిని తొలగించడానికి వంట పని వారు సైతం నానా తంటాలు పడుతున్నారు. పాఠశాలలో ఓ గదిలో బియ్యం ఆరబెట్టి పురుగులు తొలగిస్తున్నారు. కానీ వారు ఎంత వరకు పురుగులు తొలగిస్తున్నారనేదే సందేహించాల్సిన విషయం. పురుగులు పూర్తి స్థాయిలో తొలగించకుంటే విద్యార్థుల పరిస్థితి ఏమిటని, వారి ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

అస్వస్థత బారిన విద్యార్థులు

నాసిరకం బియ్యం సరఫరా అవుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రుల వాదన. దుబ్బాకలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నెం.1లో నిత్యం తెల్ల పురుగులు, మెత్తటి అన్నంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నాసిరకం మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థకు గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని వారు కోరుతున్నారు.

బియ్యంలో పురుగులు

దుబ్బాక మండలంలో 57 పాఠశాలకు దాదాపు వంద క్వింటాళ్ల బియ్యం ప్రతీ నెల సరఫరా చేస్తున్నారు. ఇందులో అధిక శాతం పురుగుల బియ్యం ఉండటం గమనార్హం. ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చర్యలు తీసుకుంటాం



నాసిరకం బియ్యం సరఫరా కాకుండా చర్యలు చేపడతాం. దుబ్బాకలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నెం.1కు అందించే బియ్యం నాసిరకంగా ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే నాణ్యమైనవి అందించేలా చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు భయాందోళనకు గురి కావద్దు.

–ప్రభుదాస్, ఎంఈఓ, దుబ్బాక

జిల్లాలో జోరు వానలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా బుధవారం వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం వేళ జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు వచ్చి చేరింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో పట్టణంలోని పలు రహదారులపై వరద పోటెత్తింది. మురుగు కాలువలు పొంగిపొర్లాయి.



సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

క్లుప్తంగా

మిరుదొడ్డిలో నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సర్వే సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బీబీనగర్, నిమ్హాన్స్ బెంగళూరు ఆధ్వర్యంలో బుధవారం మిరుదొడ్డిలో నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే-2 నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య స్థితి, జీవన శైలి సమస్యలు, ఆరోగ్య అవగాహన స్థాయిని అంచనా వేయడం, చికిత్స అంతరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్స్ డాక్టర్ వామన్ కులకర్ణి, డిపార్టుమెంట్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్ డాక్టర్ సాయి కృష్ణా తిక్కా, తెలంగాణ స్టేట్ కో ఆర్డినేటర్ బి.ప్రవళిక, రాష్ట్ర ఆరోగ్య బృందం సభ్యులు గ్రేస్, వేణు మాధురి, రంజీత్, యాదవ్, శ్రీధర్, వెంకట్రావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా పీహెచ్‌సీ డాక్టర్ సమీనా సుల్తానా, సీహెచ్‌ఓ లింగమూర్తి సర్వేను సమీక్షించారు.

కళా ఉత్సవ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

సిద్దిపేటరూరల్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళా ఉత్సవ్ పోటీల్లో రాఘవాపూర్ కేజీబీవీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి జె .హేమలత ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు గ్రూప్ డ్యాన్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. కాగా రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కరీనా , రాధిక, సుహాని, లిఖితను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, జీఈసీఓ నర్మద, మండల విద్యాధికారి రాజిరెడ్డి అభినందించారు.

జానపద పోటీల్లో రాణించిన విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట ఎడ్యుకేషన్: వరంగల్‌లో జరిగిన ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) విద్యార్థి సింధు పురుషోత్తం జానపద గేయపోటీల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. కళాశాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ డాక్టర్ మట్టా సంపత్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్య రెడ్డి, కృష్ణయ్య, ఉమామహేశ్వరి, వెంకటరమణ విద్యార్థిని అభినందించారు.

విద్యార్థులకు గుణాత్మకమైన బోధన



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న రమేశ్

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన బోధనలు అందేలా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకుడు రమేశ్ తెలిపారు. బుధవారం మండలంలోని సిర్సనగండ్లలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను సబ్జెక్టులలో పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజాకార్లకు ఎదురొడ్డిన బైరాన్‌పల్లి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- గ్రామంలో స్మారక స్తూపం నిర్మిస్తాం



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ , ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): నిజాం రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బైరాన్‌పల్లి అమరవీరులదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా వీర బైరాన్‌పల్లి గ్రామంలోని అమవీరుల స్తూపం, బురుజు వద్ద భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంత్రి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అర్ధరాత్రి నెత్తురు పారిన నేల బైరాన్‌పల్లి అని పేర్కొన్నారు. రజాకార్ల ఆగడాలను అడ్డుకుంటూ , వారి మూకలను తరిమిగొట్టిన గొప్ప చరిత్ర ఈనేలకు ఉందన్నారు. 1948 ఆగస్టు 27న రజాకార్లు గ్రామంలోకి ప్రవేశించి కాల్చి చంపి , ఇంటింటికీ తిరిగి మారణకాండ సృష్టించి మరో జలియన్‌వాలా బాగ్‌ను సృష్టించారన్నారు. గ్రామం బయట శవాల చుట్టూ మహిళలను వివస్త్రలు చేసి బతుకమ్మ ఆటలు ఆడించిన ఘటనను గుర్తు చేసుకుంటే బాధేస్తుందన్నారు. ఈ ప్రాంతం స్ఫూర్తితో వచ్చిన తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాలు, సంక్షేమం, అభివృద్ధితో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. సీఎంతో మాట్లాడి బైరాన్‌పల్లి అమరవీరుల స్మారకం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటూ వారిని గౌరవించుకుంటామని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

బైరాన్‌పల్లి అభివృద్ధికి కృషి: ఎంపీ చామల

మనందరం ఈరోజు స్వేచ్ఛా వాయులు పీల్చుకుంటున్నామంటే బైరాన్‌పల్లి అమరవీరుల త్యాగాల వల్లేనని అని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గ్రామానికి వీర బైరాన్‌పల్లిగా పేరు మార్చుకోడానికి గెజిట్ తీసుకువస్తామని, స్తూపం, బురుజు నిర్మాణం కోసం రూ. 10లక్షల నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణని గత ప్రభుత్వం పదేళ్లలో అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో సన్నబియ్యం , ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులను అందిచామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాజలింగం, టీపీసీసీ కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కమలాకర్ యాదవ్, బైరాన్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొండెంగలను పట్టుకుంటాం

- ప్రత్యేక బృందాలను రప్పిస్తున్నాం
- జిల్లా ఫారెస్టు అధికారి శ్రీధర్‌రావు
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్



జహీరాబాద్: బాధితుల వివరాలు సేకరిస్తున్న ఫారెస్టు అధికారులు

జహీరాబాద్: పట్టణంలో ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న కొండెంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని రప్పిస్తున్నట్లు డీఎఫ్‌ఓ సి.శ్రీధర్‌రావు పేర్కొన్నారు. బుధవారం 'సాక్షి' మెయిన్‌లో 'కొండెంగల వీరంగం', 20 మందికి గాయాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి ఫారెస్టు, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు స్పందించారు. పట్టణంలోని శాంతినగర్, బాగారెడ్డిపల్లి, హౌసింగ్ బోర్డు, హమాలీ కాలనీల్లో కొండెంగల దాడిలో గాయపడిన బాధితులను పరామర్శించారు. ఆయా కాలనీల ప్రజలు వాటి నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి విన్నవించారు. గాయపడిన వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని ప్రజలు కోరారు. కాగా డీఎఫ్‌ఓ శ్రీధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావుతో సంప్రదింపులు జరిపారు. కొండెంగలను పట్టుకునేందుకు నిపుణుల బృందాన్ని రప్పించేందుకు ఏర్పాట్లు చేశామని, మహబూబ్‌నగర్ నుంచి పిలిపిస్తున్నట్లు చెప్పారు. గురువారం ఉదయం పట్టుకుంటారని తెలిపారు. బాధితులకు తగిన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మరో ఇద్దరిపై దాడి ..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మరో ఇద్దరిపై కొండముచ్చులు దాడి చేసి బుధవారం గాయపరిచాయి. శాంతినగర్‌కు చెందిన మారుతీరావు, సిద్ధులు వీధిలో వెళ్తుంటే రెండు కొండు ముచ్చులు వారిపై ఆకస్మికంగా దాడి చేశాయి. గాయపడిన వారిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. జాగో తెలంగాణ నాయకులు రాములు నేత, శివప్రసాద్, ఎండీ ఇమ్రాన్ తదితరులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా అధికారులు వచ్చి గాయపడిన వారి వివరాలు నమోదు చేసుకున్నారు. వీరికి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంజీవనితో పసి హృదయాలు పదిలం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



గిఫ్ట్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): సత్యసాయి సంజీవని ఆసుపత్రి.. పసి హృదయాలను పదిలం చేస్తున్న దేవాలయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కొండపాకలోని సత్యసాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ ఆస్పత్రిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 196 మంది చిన్న పిల్లలకు గుండె సంబంధిత వ్యాధులకు ఆపరేషన్లు విజయవంతమవ్వడంతో బుధవారం గిఫ్ట ఆఫ్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడుతూ సత్యసాయి సంజీవని ఆస్పత్రి సేవలు విశ్వవ్యాప్తం అయ్యేలా ప్రతీ ఒక్కరం బాధ్యతగా కృషి చెద్దామన్నారు. జీవితం శాశ్వతం కాదని చేస్తున్న మంచి పనులు శాశ్వతంగా నిలుస్తాయన్నారు. కొండపాక శివారులో అనాథ వృద్ధాశ్రమం, అష్టాదశ శక్తి పీఠ దేవాలయం, సత్యసాయి బాలికల జూనియర్ కళాశాలతో పాటు సత్యసాయి సంజీవని చైల్డ్ హార్ట్ కేర్ ఆసుపత్రి వెలువడంతో ప్రపంచ దేశాల్లో ఈ గడ్డ సేవా రంగంలో గొప్పగా పేరొందుతోందని అన్నారు. అనంతరం గుండె ఆపరేషన్ చేయించుకున్న పిల్లలకు గిఫ్ట ప్ లైఫ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వహణ చైర్మన్ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో భారీ చోరీ..

బంగారం, వెండి అపహరణ

పటాన్‌చెరు టౌన్: ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పీఎస్‌ఆర్ టౌన్ షిప్‌లో ఉంటున్న పవన్ కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తన భార్య లక్ష్మి హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచరుగా విధులు నిర్వహిస్తుండటంతో 16న ఉదయం అక్కడ వదిలి, అతడు కూడా తన విధులకు వెళ్లాడు. సాయంత్రం లక్ష్మి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 20 తులాల బంగారం, నాలుగు కిలోల వెండి, రూ.8 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించింది. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీ

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని ముస్త్యాల శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామ శివారులోని సలాక్‌పూర్ క్రాస్ రోడ్డు సమీపంలో నాగోతి సమర్ అంజయ్యకు చెందిన స్థలంలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను అపహరించారు. చోరీ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని ఇబ్రిహిబాద్ గ్రామానికి చెందిన గారకుర్తి కృష్ణకు చెందిన పాడి గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వివరాలు ఇలా... గ్రామ శివారులో మేత మేపుతుండగా ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న ఎర్తింగ్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు



కొమురవెల్లి(సిద్దిపేట): వివరాలు వెల్లడిస్తున్న సీఐ

కొమురవెల్లి(సిద్దిపేట): గంజాయి అమ్ముతున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్, పోలీసులు కలిసి అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చేర్యాల సీఐ ఎల్. శ్రీను ఎస్ఐ రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. మండల శివారులోని దాచారం గుట్ట సమీపంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, పోలీసులు కలిసి దాడి చేశారు. ఈ దాడిలో కుంభ భూమరాజును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 195 గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పారిశ్రామిక వాడలో..



మనోహరాబాద్(తూప్రాన్): నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తూప్రాన్, మనోహరాబాద్(తూప్రాన్): పారిశ్రామిక ప్రాంతంలో బీహార్‌కు చెందిన వ్యక్తి నుంచి 1.350 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ గోపాల్ వివరాలు వెల్లడించారు. మనోహరాబాద్ మండలం పారిశ్రామిక ప్రాంతంలో గంజాయి విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించినట్లు తెలిపారు. తమ విచారణలో ఓ స్టోరేజీ పరిశ్రమలో బీహార్‌కు చెందిన ముఖేశ్ కుమార్ మండల్(29) ఆయా పరిశ్రమల్లో కార్మికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల యువకులకు గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని ఎండు గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నర్సాపూర్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్ఐ బాలయ్య, హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య, కానిస్టేబుళ్లు రాజు, నరేశ్, రవి, హరీశ్‌లు పాల్గొన్నారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు..

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే మాణిక్‌రావ్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం నియోజకవర్గ సమస్యలపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలిశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాటాడుతూ.. బేగంపేటలో ఫిషరీస్ బిల్డింగ్ కోసం స్థలం కేటాయించాలని కోరారు. సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న వెజ్ నాన్ వెజ్ బిల్డింగ్‌ను పూర్తి చేయాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్న శాసన సభ్యునికి అవమాన పరిచేలా కలెక్టర్ మాట్లాడడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేకు పూర్తిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అర్హత ఉంటుందని ప్రతిపక్షంలో ఉన్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి 40 శాతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశాలు ఇస్తే కలెక్టర్ ప్రావీణ్య పట్టింపు లేని సమాధానాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సాయి కుమార్, కొండల్ రెడ్డి, ప్రభాకర్, శ్రీధర్ రెడ్డి, విష్ణు తదితరులు ఉన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం



సీతారాం

రామచంద్రాపురం(పటాన్ చెరు): ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కొల్లూరు డబుల్ బెడ్‌రూం(కే సీఆర్‌నగర్)కాలనీలో నివాసముండే సీతారాం క్యాబ్‌డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కిరాణా షాప్‌నకు వెళ్లిన మహిళ..



మమత కుమారి

పటాన్‌చెరు టౌన్: మహిళ అదృశ్యమైంది. బీహార్ నుండి బతుకుదెరువు కోసం వచ్చిన సంతోష్ భార్యతో కలిసి డివిజన్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 16న సంతోష్ భార్య మమతా కుమారి షాప్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వేప పుల్లల కోసం వెళ్లి...



రాంలా నాయక్

పటాన్‌చెరు టౌన్: వేప పుల్లల కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి విజేత కాలనీకి చెందిన రాంలా నాయక్ 16న తెల్లవారు జామున పళ్లు తోమేందుకు వేప పుల్లలు తీసుకొస్తానని ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ తల్లి మృతి

అనాథలుగా మారిన చిన్నారులు



కొడకండ్లలో తల్లి మృతదేహం వద్ద దిక్కుతోచని స్థితిలో ఉన్న పిల్లలు

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతానికి గురై మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఆమె ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. ఈ ఘటన మండలంలోని కొడకండ్లలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మిందె గౌరయ్య–మనిలా(38) దంపతులకు కూతురు రేణ, కొడుకు విష్ణు ఉన్నారు. వీరికి ఇంటితో పాటు ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గౌరయ్య 4 ఏళ్ల క్రితం అనారోగ్యానికి గురై మృతి చెందడంతో పిల్లల బాధ్యత మనీలాపై పడింది. దీంతో ఆమె గజ్వేల్‌లోని ఓ హోటల్‌లో కూలీ పనులు చేస్తూ పిల్లలను సాకుతుంది. ఈ క్రమంలో నెల రోజుల క్రితం హోటల్‌లో పనిచేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. నాలుగేళ్ల క్రితం తండ్రి, ఇప్పుడు తల్లి మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. గ్రామస్తులు, బంధువుల సహకారంతో చందాలు వేసి బుధవారం మనీలా అంత్యక్రియలు నిర్వహించారు. ఇద్దరు పిల్లలను మానవతావాదులు, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

భవనం పైనుంచి దూకి..

- మతిస్థిమితం సరిగా లేని మహిళ మృతి
- ఆస్పత్రి నుంచి మృతదేహం తరలింపు
- పోలీసులతో బంధువుల వాగ్వాదం



అంజమ్మ

వట్‌పల్లి(అందోల్): మతిస్థిమితం సరిగాలేని మహిళ భవనంపై నుంచి దూకడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ కేసు మండలంలో చర్చనీయాంశమైంది. వివరాలు... మునిపల్లి మండలం పెద్ద చెల్మడ గ్రామానికి చెందిన అంజమ్మ (45) అందోలు మండలంలోని మాసానిపల్లి గ్రామంలో గల తమ బంధువు కుమార్ గౌడ్ ఇంట్లో ఉంచారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో ఉండటంతో 15 రోజులుగా మందులు వాడకపోవడం వల్ల మతిస్థిమితం తప్పినట్లు బంధువులు చెప్పారు. 16న రాత్రి 9 గంటల సమయంలో అంజమ్మ భవనం పైకి ఎక్కి దూకింది. గమనించిన కుమార్ గౌడ్ అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెకు సీపీఆర్ చేసి, జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లేందుకు అభ్యంతరం తెలిపారు. 17న 3 గంటల సమయంలో మృతదేహాన్ని పెద్ద చెల్మడ గ్రామానికి తరలించి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ పాండు వెళ్లి మృతదేహాన్ని తమకు అప్పగించాలన్నారు. దీంతో మృతురాలి బంధువులు, మృతురాలి భర్త రాజయ్య పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. చివరకు నచ్చజెప్పి సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించారు.

దేశ గురువు పేరిట డబ్బులు వసూలు

నంగునూరు(సిద్దిపేట): ప్రజలను మభ్య పెట్టి డబ్బులు వసూల్ చేస్తున్న ఓ వ్యక్తిని యువకులు నిలదీయడంతో ఫోన్‌పే ద్వారా తిరిగి డబ్బులు చెల్లించాడు. ఈ ఘటన మండలంలోని బద్దిపడగలో చోటు చేసుకుంది. గ్రామస్తులు వివరాలు... సోమవారం రాత్రి గ్రామానికి తెల్లగుర్రంపై ఓ వ్యక్తి అనుచరులతో వచ్చి తాను దేశ గురువును అని మీ బాధలు, ఇబ్బందులు తొలగిస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన కొందరు వడ్డెర కాలనీలో బస ఏర్పాటు చేశారు. ఉదయం గురువు గ్రామంలో తిరుగుతాడని గుర్రానికి నీళ్లు పోసి బాధలు చెప్పుకుంటే తాయత్తు ఇచ్చి సమస్యలు తీరుస్తాడని దండోరా వేయించారు. మీ సమస్యలు దూరం చేస్తానని, అంత వరకు తాను ఇచ్చే తాయత్తు కట్టుకోవాలని చెప్పి డబ్బులు తీసుకున్నాడు. అతని ప్రవర్తనపై అనుమానం కలుగడంతో సుంచు స్వామి, వడ్లూరి బాబుతోపాటు యువకులు గురువుతోపాటు అతని అనుచరులను నిలదీశారు. గ్రామస్తుల వద్ద తీసుకున్న డబ్బులు ఇవ్వకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామనడంతో కొందరికి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించారు. అనంతరం అక్కడి నుంచి జారుకున్నారు.

సేవే లక్ష్యం.. అవగాహనే ముఖ్యం

- పల్లె సేవలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు
- అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థినులు



ఎర్రవల్లిలో ప్లాస్టిక్‌ను సేకరిస్తున్న విద్యార్థులు

మర్కూక్(గజ్వేల్): గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉంటుందని, ప్రతి ఒక్కరిలో చైతన్యం వచ్చేలా తమ వంతు కృషి చేస్తున్నారు. సేవే లక్ష్యంగా స్వచ్ఛందంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు. గ్రామంలోని వీధుల్లో చెత్తా చెదారం, ప్లాస్టిక్, మురుగు నీరు, ప్రజలకు రోగాలు ఏ విధంగా వస్తున్నాయని అవగాహన కల్పిస్తున్నారు. ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తయారు చేయాలనే లక్ష్యంతో 60 మంది విద్యార్థినులు గ్రూపులుగా విడిపోయి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని మాజీ సీఎం దత్తత గ్రామం ఎర్రవల్లిలో హైదరాబాద్‌లోని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ కళాశాల విద్యార్థినులు సుమారు 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మూడు రోజుల నుండి ఎర్రవల్లి గ్రామంలో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు వివరిస్తున్నారు. గ్రామంలో రోడ్లపై మురుగునీరు పారుతుండటంతో దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు సోకే ప్రమాదం ఉందని గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. హెల్త్ క్యాంపు నిర్వహించి రక్త పరీక్ష, హిమోగ్లోబిన్, బీపీ, షుగర్ వాటికి వెంటనే మందులు ఇస్తున్నారు. గ్రామ వీధుల్లో తిరుగుతూ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లను తొలగిస్తున్నారు. మూడు రోజులుగా గ్రామ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నారని మాజీ సర్పంచ్ భాగ్య తెలిపారు.

వ్యాధులపై అవగాహన



ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. రోగాల భారిన పడకుండా ఉండేందుకు తమ వంతు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. వారికి అవగాహన కల్పించేలా స్వయంగా తామే పరిసరాలను శుభ్రం చేశాం. ప్రత్యేకంగా డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించాం.

– ప్రియా, విద్యార్థిని

ప్రజలతో మమేకమై..



నేను బేగంపేట మహిళా కళాశాలలో డిగ్రీ థర్డ్ ఇయర్ చదువుతున్నాను. ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో పాల్గొని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉంది. గ్రామాల్లోకి వచ్చి ప్రజలతో మమేకమై చాలా విషయాలు తెలుసుకున్నా. మునుముందు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతా.

– నిక్షిత, విద్యార్థిని

వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు



గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాం. హెల్త్ క్యాంపు నిర్వహించి రక్త నమూనాలను సేకరించి వెంటనే మందులు పంపిణీ చేశాం. డెంగీ సోకకుండా జాగ్రత్తలు సూచించాం. ప్రజల సహకారం అభినందనీయం.

– డాక్టర్ ప్రసన్న (ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్)